# ప్రజలందరికి నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేయాలి

## పేదవాడి కడుపు నింపేందుకు ప్రభుత్వ ప్రతిష్టాత్మక నిర్ణయం సన్న బియ్యం పంపిణీ : నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** ప్రతి పేదవాడు కడుపు నిండా భోజనం చేయాలనే సద్దుదేశ్యంతోనే దేశంలో ఎక్కడ కూడా లేకుండా కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే రేషన్ కార్డు లబ్ధి దారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం అందజేస్తుందని కలెక్టర్ బాదావత్‌సంతోష్ పేర్కొన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ మండలం ఎండబెట్ల గ్రామంలోని రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీ విధానాన్ని అదనపు కలెక్టర్, లోకల్ బాడీస్ దేవ సహాయం, నాగర్‌కర్నూల్ తహసిల్దార్ తబితరాణితో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పరిశీలించారు. పేదవాడి కడుపు నింపేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ నిర్ణయం తీసుకుందని జిల్లా కలెక్టర్ అన్నారు. రేషన్ దుకాణంలోని బియ్యం నాణ్యతను, బియ్యం సంచుల తుకాలను పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజలందరికీ నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించిందని, అర్హత గల ప్రతి పేదవాడికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని, రేషన్ కార్డుదారులకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా సన్న బియ్యం అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 558 రేషన్ షాపుల ద్వారా 2,43,107 రేషన్ కార్డ్ దారులకు 4946.455 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని తద్వారా పేద ప్రజలందరికి లబ్ధి చేకూరుతుందని వివరించారు. జిల్లాలో 100 శాతం చౌక ధరల దుకాణాల ద్వారా అర్హత గల లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని, ఈ కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు. ఈ పథకం వల్ల పేద మరియు మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు.


తూకాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

# వేసవి కాల దృష్ట్యా తాగునీటి ఎద్దడికి నివారణ చర్యలు చేపట్టాలి : జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్16 ప్రభాతవార్త:** వేసవి కాల దృష్ట్యా ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని మిషన్ కాంపౌండ్ కాలనీ, బీసీకాలనీలలో త్రాగు నీటి వసతులను అదనపు కలెక్టర్, లోకల్ బాడీస్ దేవ సహాయంతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నీటి సరఫరాలో ఏమైనా సమస్యలు ఉన్నాయా లేదా ప్రజలు ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా అని నేరుగా ప్రజలతో మాట్లాడి జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కాలనీ ప్రజలతో కలిసి అందుబాటులో ఉన్న నీటి సరఫరా వ్యవస్థను పరిశీలించారు. నీటి ట్యాంకులు, పైపులైన్లు మరియు ఇతర నీటి సరఫరా సంబంధిత మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పట్టణ ప్రాంత ప్రజల యొక్క త్రాగునీటి అవసరాలను గురించి అధికారులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరాను మెరుగుపరచడానికి మరియు ప్రజలకు నిరంతరాయంగా త్రాగునీరు అందించడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు సూచనలు చేశారు. త్రాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తుందని తెలియజేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని పైప్‌లైన్ లీకేజీ లేకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ కమిషనర్ నరేష్ బాబు, మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కాలనీ వాసులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

# వరి ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవద్దు

- ప్రజా ప్రభుత్వంలోనే రైతన్న సంక్షేమానికి పెద్దపీట
- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి

**చిన్నచింతకుంట, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** రైతులు పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి తెలిపారు. బుధవారం ఐకెపి ఆధ్వర్యంలో చిన్నచింతకుంట, అల్లిపూర్ ,అప్పంపల్లి సింగిల్ విండో ఆధ్వర్యంలో కురుమూర్తి గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. సన్నాళ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందించడంతో రైతన్న కళ్ళల్లో ఆనందాన్ని చూస్తున్నామన్నారు. ప్రతి రైతు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలోని అమ్ముకోవాలని ఆయన సూచించారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే వరి ధాన్యాన్ని కొర్రీలతో ఇబ్బంది పెట్టకుండా చూడాలని అధికారులకు ఆయన ఆదేశించారు. వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రేడ్ ఏ సన్న వడ్లకు రూ.2320,గ్రేడ్ ఏ దొడ్డు ధాన్యానికి రూ.2300 మద్దతు ధరను అందిస్తున్నామన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అధిక నిధులు కేటాయిస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ఆర్థిక ఇబ్బందులను అధిగమించి అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, విండో చైర్మన్ సురేందర్ రెడ్డి, మానిటరింగ్ అధికారి కె.దివ్య, తహసిల్దారుఎల్లన్న, మండల వ్యవసాయ అధికారి రాజేష్ కన్నా, ఏపిఎం విష్ణు చారి, సింగిల్ విండో కార్యదర్శిబషీర్, టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్‌రెడ్డి, నాయకులు ఎస్ వెంకటేష్, ప్రదీప్ రెడ్డి, జిజి పాల్, వజీర్‌బాబు, గూడూరు శేఖర్, శేఖర్, శ్రీనివాస్ గౌడ్, ప్రతాప్, సాంసోన్, అశోక్, పొర్ల వెంకటేష్, అల్లిపూర్, కురుమూర్తి గ్రామ అధ్యక్షులు దామోదర్ యాదవ్, కురుమన్న, సహదేవుడు, కృష్ణారెడ్డి, రవిలతోపాటు ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

# సాయి మందిరంలో ఘనంగా రజతోత్సవాలు

**ఆత్మకూరు, ఏప్రిల్16 ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో ప్రతిష్టించిన శిరిడి సాయి దేవాలయంలో బుధవారం రజతోత్సవ వేడుకలను దేవాలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక కేంద్రంగా భావించి 25 సంవత్సరాల క్రితం అప్పటి ఎమ్మెల్యే కీర్తిశేషులు కొత్తకోట దయాకర్ రెడ్డి నేతృత్వంలో సాయిబాబా మందిరాన్ని నిర్మించి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన హోమంతో సాయంత్రం వరకు ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురుఎమ్మెల్యేలు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ తదితరులు సాయిబాబా దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కీర్తిశేషులు కొత్తకోట దయాకర్ రెడ్డి, సతీమణి, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ చైర్మన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో రజతోత్సవ కార్యక్రమాలను పురస్కరించుకొని బుధవారం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి బుధవారం సాయంత్రం సాయిబాబా మందిరాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి జిల్లాకు చెందిన ప్రముఖులు తదితరులు సాయిబాబా దేవాలయాన్ని దర్శించుకుని వద్దోత్సవ వేడుకల్లో పాల్గొన్నాడమే కాకుండా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్ని వర్గాల నుండి సంపూర్ణ సహకారం అందించడంతో దిగ్విజయంగా పూర్తి చేసుకున్నామని సాయిబాబా మందిర కమిటీ నిర్వాహకులు దివాంచి ప్రభాకర్ రావు ప్రభాతవార్తకు తెలిపారు. సాయిబాబా మందిరంలో బుధవారం నిర్వహించిన రజతోత్సవ వేడుకలకు ఆత్మకూర్ పట్టణం ఉండే కాకుండా మండలంలోని వివిధ గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, కొత్తకోట సీతా దయాకర్‌రెడ్డి

## బీఆర్ఎస్ వరంగల్ సభ సన్నాహక సమావేశం


వరంగల్ సభ పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం


**భూత్పూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** వరంగల్‌లోని ఎల్కతుర్తిలో ఈ నెల 27న బీఆర్ఎస్ ఆవిర్భావ సభ, రజితోత్సవ వేడుకల సందర్భంగా బుధవారం భూత్పూర్ పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. వరంగల్ సభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా బస్వరాజ్‌గౌడ్ మాట్లాడుతూ మాజీ సీఎం, బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పాతికేళ్ల క్రితం తెలంగాణరాష్ట్ర సాధనేధ్యేయంగాతెలంగాణ రాష్ట్రసమితి (టీఆర్ఎస్)పేరిట ఉద్యమ పార్టీ స్థాపించి తెలంగాణ ప్రజల్లో తెలంగాణ రాష్ట్ర కాంక్షను నాటారని, పార్టీ స్థాపించి ఈ నెల 27నాటికి పాతికేళ్లుపూర్తి కావస్తున్న నేపథ్యంలో రజితోత్సవ వేడుకలు(సిల్వర్ జుబ్లీ వేడుకలు)ఘనంగా నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడుసత్తూర్ బస్వరాజ్‌గౌడ్‌అన్నారు. ఈ రజితోత్సవ వేడుకలకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాధి మంది కార్యకర్తలు, బీఆర్ఎస్ అభిమానులు హాజరౌతున్నారని, భూత్పూర్ పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి వేలాది మంది తరలిరావాలని, అందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారాలు నిర్వహించి వరంగల్‌సభకు వేలాదిగాతరలివచ్చేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. వరంగల్ సభలో మాజీ సీఎం, పార్టీ అధినేత కేసీఆర్ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలకు దశా నిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. ఈ సన్నాహక సమావేశంలో పార్టీ నాయకులు మనెమోని సత్యనారాయణ, తూము శ్రీనివాస్‌రెడ్డి, సత్తూర్ నారాయణగౌడ్, మొల్గర నర్సింహులుగౌడ్, గడ్డం ప్రేమ్‌కుమార్, మొహ్మద్ సాధిక్, గడ్డం రాములు, సత్తూర్ అశోక్‌గౌడ్, బోల వెంకట్రాములు, రమేష్‌చందర్, సత్తూర్ సురేష్‌గౌడ్, వెంకటేష్, రామకృష్ణ, పులగుర్ల మల్లేష్, సత్తూర్ తిరుపతయ్యగౌడ్ పాల్గొన్నారు.

## భూత్పూర్‌లో పశువైద్య శిబిరం

**భూత్పూర్, ఏప్రిల్16, ప్రభాతవార్త:** పశువైద్యంలో భాగంగా బుధవారం భూత్పూర్ పట్టణ కేంద్రంలోని పశువైద్యశాలలో పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గాలికుంటు తదితర వ్యాధులు సోకకుండా పశువులకు టీకాలు వేశారు. భూత్పూర్ పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో నేటి నుంచి వారం రోజుల పాటు పశువైద్యశిబిరాలు నిర్వహించి పశువులకు టీకాలు వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారిడాక్టర్ మధుసూధన్ తెలిపారు. భూత్పూర్‌లోతొలిరోజు నిర్వహించిన టీకాల కార్యక్రమంలో జిల్లా పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ శివానందస్వామి హాజరయ్యారని మండల పశువైద్యాధికారి డాక్టర్ మధుసూధన్ తెలిపారు.

## రైతు చెంతకే వరి కొనుగోలు కేంద్రాలు

- నారాయణపేట ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికరెడ్డి



**కోయిలకొండ, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** రైతు చెంతకే వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని నారాయణపేట ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణిక రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సూరారం, ఇబ్రహీంనగర్ గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేయడం జరుగుతుందన్నారు. రైతు పండించిన ధాన్యాన్ని నేరుగా వరి కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలన్నారు. అనంతరం మండలంలో పలు వివాహ శుభకార్యాలకు ఎమ్మెల్యే హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జి.రవీందర్ ముదిరాజ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వై.విద్యాసాగర్‌గౌడ్, నాయకులు పిట్ల శేఖర్ ముదిరాజ్, వేముల జగన్‌గౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ ఎం. రామస్వామి, రవి నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండి నాగరాజు, మడుగు వెంకటయ్య, జి.మనోజ్ కుమార్, ఎంపీడివో కాళ్ళప్ప, ఐకెపి ఎపిఎం మల్లేష్, ఇబ్రహీం నగర్ గ్రామ వివోఏలు చెన్నయ్య, రాజు, గ్రామ ఐక్య సంఘం అధ్యక్షురాలు లక్ష్మి, రాధా, సుజాత, సత్యమ్మ, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

## గద్వాల పోస్ట్ ఆఫీస్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకుల నిరసన


గద్వాల ప్రధాన తపాల కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**గద్వాల, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** నేషనల్ హెరాల్డ్ పత్రిక కేసులో కక్షపూరితంగా కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఏఐసీసీ అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను చేర్చడం పై గద్వాల కాంగ్రెస్ నాయకులు గద్వాల ప్రధాన పోస్ట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. బుధవారం పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, పిలుపుమేరకు ఎఐసిసి కార్యదర్శి మాజీ శాసనసభ్యులు సంపత్ కుమార్ సూచన మేరకు మాజీ జడ్పి చైర్మన్ సరిత తిరుపతయ్య నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆధ్వర్యంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, పీసీసీ కార్యదర్శి బీ. శంకర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ ఇసాక్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమలేష్, బుధవారం గద్వాల పట్టణ పోస్ట్ ఆఫీస్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం నేషనల్ హెరాల్డ్ పత్రిక కేసులో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ పేర్లు చేర్చడం కక్షపూరిత రాజకీయ వైఖరికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ కౌన్సిలర్ లు భాస్కర్ యాదవ్, సురేష్ ,జనార్దన్ నాయకులు డి.ఆర్ శ్రీధర్, ఆనంద్ గౌడ్ దినేష్, రాము శ్రీనివాస్ గౌడ్, కౌసర్ బేగ్, టీఎన్ఆర్ జగదీష్, కాంగ్రెస్ నాయకులు పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**ఆత్మకూరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం గత శాసనసభ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసే కార్యక్రమంలో భాగంగా ప్రస్తుత రబీ సీజన్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయడమే కాకుండా క్వింటాలుకు 500రూపాయల బోనస్ చెల్లించేందుకు సిద్ధంగా ఉందని ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పరమేష్, మాజీ మండల అధ్యక్షుడు రహమతుల్లా, కిసాన్ సెల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మనివర్ధన్ రెడ్డి తదిత రులు అన్నారు. బుధవారం ఆత్మకూరు మండలంలోని జూరాలగ్రామంలో ప్రస్తుతరబీ సీజన్‌కు సంబంధించి వరి ధాన్యంకొనుగోలు కేంద్రాన్ని వారుప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమకాలువ, రామన్పాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా ప్రస్తుత రవి సీజన్లో పెద్ద ఎత్తున వరి ధాన్యాన్ని పండించిన రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయించి ప్రభుత్వం చెల్లించే నగదు తో పాటుగా బోనస్ రూపాయలను అందుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు బోనస్ చెల్లించకుండా దుర్మార్గంగా వ్యవహరించారని ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ మాత్రం రైతులను రాజుగా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సింలు, వెంకటన్న ,రవికుమార్ తదితరులతో పాటుగా పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జర్నలిస్టును పరామర్శించిన ఎమ్మెల్యే


జర్నలిస్టును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

**మక్తల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** ఇటీవల అనారోగ్యానికి గురై శస్త్ర చికిత్స చేయించుకున్న మక్తల్ పట్టణానికి చెందిన జర్నలిస్టు, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు బి. అంబదాస్‌రావును బుధవారం మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి పరామర్శించారు. మక్తల్ పట్టణంలోని అంబదాస్ రావు నివాసానికి ఎమ్మెల్యే వెళ్లి ఆరోగ్య పరిస్థితిని స్వయంగా తెలుసుకుని ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే వెంట మాజీ జడ్పిటిసి జి. లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి.గణేష్ కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రవికుమార్, మాజీ ఉప సర్పంచ్ కట్ట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

**మక్తల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** మక్తల్ మండలంలోని సంగంబండలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం మక్తల్ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ జి. రాధాలక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మక్తల్ మార్కెట్ యార్డ్ పరిధిలో ఇప్పటివరకు దాదాపు పది ప్రాంతాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు. రైతులు పండించిన ప్రతిగింజను విక్రయించేవరకు కొనుగోలు కేంద్రాలు కొనసాగుతాయని ఆమె అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు తమ ధాన్యాన్ని తీసుకువచ్చి కనీస మద్దతు ధరను పొందాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి జి.బలరాంరెడ్డి, పిఏసిఎస్ అధికారి రాములు, డైరెక్టర్ మహాదేవప్ప, నాయకులు చిన్నారెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే



**గద్వాల టౌన్, ఏప్రిల్16, ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి సీఎం సహాయ నిధి లబ్ధిదారులకు అందజేసారు. గట్టు మండల పరిధిలోని గొర్లఖాన్ దొడ్డి గ్రామానికి చెందిన జయలక్ష్మి భర్త లక్ష్మిరెడ్డి కి చికిత్స నిమిత్తం గద్వాల ఎమ్మెల్యే చేతుల మీదుగా సీఎం సహాయం నిధి క్రింద 42,000 వేల రూపాయల చెక్కునువారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ తిమ్మప్ప, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, మాజీ జెడ్పి కో ఆప్షన్ మెంబెర్ ఇమామ్ సాబ్, అహ్మద్, నారాయణ, నర్సింహులు, సిద్దప్ప నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిపత్ పథకం దరఖాస్తుల గడువు పెంపు

**గద్వాల టౌన్, ఏప్రిల్16 ప్రభాతవార్త:** భారత ఆర్మీ రిక్రూట్మెంట్ 2025-26 సంవత్సరానికి గాను అగ్నిపథ్ పథకం కింద అగ్నివీర్ నియామకానికి దరఖాస్తుల గడువు పొడిగింపు ఈ నెల 25 వరకు పొడిగించినట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి డా.ఎం. ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. దేశసేవ చేయాలనే ఆశతో ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. కనీసం 17 సంవత్సరాలు పైబడిన అభ్యర్థులు భారత ఆర్మీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు అని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

## నేడు భూభారతిపై రైతులకు అవగాహన సదస్సు

**ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** నేడు మండల పరిధిలోని అన్ని రైతు వేదికల వద్ద రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భూభారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశామని మండల తహశీల్దార్ సుగుణ తెలిపారు. ఈ అవగాహన సదస్సులను రైతులు ఉపయోగించుకోవాలని ఆయా క్లస్టర్ గ్రామాలకు చెందిన రైతులు వారి రైతు వేదికల వద్ద పాల్గొనాలని చెప్పారు. భూములకు సంబంధించిన అన్ని రకాల సమస్యలకు పరిష్కార మార్గాలను తెలియజేస్తారని రైతులు వినియోగించుకోవాలన్నారు.

## శివాలయ నిర్మాణం కోసం లక్ష రూపాయల విరాళం

**ధన్వాడ, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** ధన్వాడ మండలంలోని గున్ముక్ల గ్రామంలో వెలిసినటువంటి శ్రీశ్రీశ్రీ స్వయంభు కడప రాయ స్వామి గుట్టపై ఉన్న శివాలయ నిర్మాణము కొరకై డి.రాంచందర్ రావు చెల్లెలు అయిన అనంత నిర్మాలాదేవి శివాలయం కొరకు రూ.1 లక్ష విరాళం ఇవ్వడం జరిగినది. గున్ముక్ల గ్రామం ఆలయ కమిటి తరపున వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో కడపరాయ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు బాలయ్య గౌడ్, జనరల్ సెక్రెటరీ గౌడపోల నరసింహారెడ్డి, సెక్రెటరీ గజి కృష్ణయ్య, గున్ముక్ల మాజీ ఎంపిటిసి సుధీర్ కుమార్‌రావు, గున్ముక్ల మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాసులు, ఎం.వెంకట నరసింహులు, దాసరి నరసింహ, కోస్గి నరేష్, పూజారి నంబి నాగార్జున్, ధన్వాడ శాంతి కుమార్ ఎండి నసార్ తదితరులు పాల్గొన్నారు.


లక్ష రూపాయల విరాళం అందజేస్తున్న దృశ్యం

## సంగంబండ ప్రాజెక్టు నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం

- మాజీ ఎంపీటీసీ జి. బలరాంరెడ్డి

**మక్తల్, ఏప్రిల్16 (ప్రభాతవార్త):** మక్తల్ మండలంలోని సంగంబండ వద్ద నిర్మించిన చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్వహణలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ప్రాజెక్టులోని సాగు నీరంతా లీకేజీల రూపంలో వృధాగా వెళ్లి దాదాపు 30వేలఎకరాల్లో వరిపంటపూర్తిగా ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని మాజీ ఎంపిటిసి జి. బలరాంరెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టుకు అమర్చిన మొత్తం 10 షట్టర్లలో ఐదు షట్టర్లు బ్రేక్ డౌన్ అయ్యాయని ఆయన అన్నారు. మిగతా 5 షట్టర్లల్లో మూడు షట్టర్లలో నుంచి నీరంతా లీకేజీ రూపంలో దిగువకు వృధాగా పోతుందని ఆయన అన్నారు. ప్రాజెక్టు వద్ద నీటిని విడుదల చేసేందుకులష్కర్లను సైతం నియమించకపోవడంతో నిర్వహణ ఘోరంగా మారిందన్నారు. దీంతో ఈప్రాజెక్టునే నమ్ముకొని పంటలను సాగుచేసిన మక్తల్, మాగనూరు, నర్వ, కృష్ణ మండలాల్లోని రైతులు సాగు నీరందక అవస్థలు పడుతున్నారని ఆయన అన్నారు. ఈ నాలుగు మండలాల్లోని దాదాపు 30 వేల ఎకరాల్లో సాగునీరు అందక రైతులు సాగుచేసిన వరి పంటపూర్తిగా ఎండిపోయిందన్నారు. దీంతో రైతులకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందన్నారు. ఈ దుస్థితికి ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించి పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటి పరిస్థితికి ప్రభుత్వం మేల్కొని తక్షణమే సంగంబండ ప్రాజెక్టు షట్టర్లను మరమ్మతు చేసి రాబోయే వర్షాకాలం సీజన్లోనైనా నీరు వృధాగా పోకుండా అరికట్టి రైతులను కాపాడాలని ఆయన అన్నారు. లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో ప్రాజెక్టు వద్ద ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు.

## 18న జిల్లా స్థాయి షూటింగ్ బాల్ పోటీలు

**మక్తల్, ఏప్రిల్16 ప్రభాతవార్త:** ఈనెల 18న మక్తల్ పట్టణంలోని మినీ స్టేడియంలో జిల్లా స్థాయి షూటింగ్ బాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం, జిల్లా అధ్యక్షుడు సత్య ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ తెలిపారు. బుధవారం మక్తల్ పట్టణంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ పోటీలలో నారాయణపేట జిల్లాలోని 18ఏళ్లలోపు బాల బాలికలందరూ వారి వారి స్థాయిల్లో పాల్గొనవచ్చని వారు తెలిపారు. జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన బాల బాలికలను ఈనెల25నుంచి 27 వరకు నారాయణపేట జిల్లాలోని ఊట్కూరు మండలం బిజ్వార్ లో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెం : 77027 13139 లో సంప్రదించాలని వారు కోరారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**ఉప్పునుంతల, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారికి బుధవారం అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సతీమణి సిబిఎం ట్రస్ట్ చైర్పర్సన్ డా. చిక్కుడు అనురాధ, అచ్చంపేట రెవెన్యూ డివిజన్ అధికారిణి మాధవిల చేతుల మీదుగా లబ్ధిదారులకు కళ్యాణ్‌లక్ష్మి, షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు తహసీల్దార్ ప్రమీల, మామిళ్లపల్లి దేవస్థాన కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు, వెల్టూరు మాజీ ఎంపీటీసీ రెడ్డి రెడ్డి రంగారెడ్డి, కాల్వ గోవర్ధన్ రెడ్డి, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కృష్ణ, గుద్దటి బాలరాజ్, సయ్యద్, రమేష్, రెవెన్యూ సిబ్బంది శంకర్ తదితరులున్నారు.

## వినయ్ కుమార్ రెడ్డికి ఘన సన్మానం

**ఆత్మకూరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** ఆత్మకూరు మండలంలోని బోలమల్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కిసాన్ సెల్ ఆత్మకూరు మండలం అధ్యక్షుడు వినయ్ కుమార్ రెడ్డిని గ్రామస్తులు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయ బృందం బుధవారం ఘనంగా సన్మానించారు. గత కొన్ని రోజులుగాగ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత నేపథ్యంలో వినయ్ కుమార్ రెడ్డి తన సొంత నిధులను వెచ్చించి పాఠశాలకు ఒక విద్యా వాలంటీరును నియమించి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించడంలో తోడ్పాటునందించిన విషయాన్ని గుర్తించి పాఠశాలకు చెందిన ఉపాధ్యాయ బృందం గ్రామ ప్రముఖులు తదితరులు బుధవారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వినయ్ కుమార్ రెడ్డిని ఘనంగా శాలువాలతో సన్మానించారు. భవిష్యత్తులో పాఠశాలకు అవసరమైన మేరా సహాయ సహకారాలు అందించేందుకు తాను ఎల్లవేళలా ముందుంటానని వినయ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటన్న, ఉపాధ్యాయ సిబ్బంది గ్రామానికి చెందిన ప్రముఖులు ప్రతాపరెడ్డి, యుగంధర్‌రెడ్డి, శేఖర్ తదితరులతో పాటుగా పలువురు పాల్గొన్నారు.


మూలమల్లలో వినయ్ కుమార్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

# భూ భారతి చట్టంపై రెవెన్యూ అధికారులకు పూర్తి అవగాహన ఉండాలి

■ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి టౌన్,ఏప్రిల్16 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకు వచ్చిన భూ భారతి 2025 చట్టంపై రెవెన్యూ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఖీభూ భారతిఖీ భూమి హక్కుల రికార్డు 2025 చట్టంపై తహసిల్దార్లు, డిప్యూటీ తాసిల్దార్లు, ఆర్ఐలు, ఇతర రెవెన్యూ సిబ్బందితో పాటు ఇతర అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు అందరికీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూభారతి చట్టంలోనిముఖ్యంశాలను వివరించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డిఆర్డిఓ ఉమాదేవి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఉన్న ధరణి స్థానంలో భూభారతి భూమి హక్కుల రికార్డు 2025 చట్టాన్ని కొత్తగా తీసుకువచ్చిందని తెలిపారు. ఈ చట్టంపై రెవెన్యూ అధికారులు ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. చట్టంలోని అన్నినియమాలను చదివి తెలుసుకోవాలని, ఏవైనా సందేహాలు ఉంటే అవగాహన కార్యక్రమంలోనే అడిగి నివృత్తి చేసుకోవాలని తెలియజేశారు. ముఖ్యంగా తహసిల్దార్లు చట్టం లోని ప్రతి ఒక్క అంశం పైనఅవగాహన సాధించాలన్నారు. ప్రభుత్వం ఈ నూతన చట్టం ద్వారా అనేక భూ సమస్యలకు పరిష్కార మార్గం చూపించనుందని తెలిపారు. తహసిల్దారు చేసిన మ్యూటేషన్లు, జారీ చేసిన పాస్ పుస్తకాలపై అభ్యంతరాలు ఉంటే



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ఆర్డిఓకు లేదా కలెక్టర్కు అప్పిలు చేసుకునేలా రెండు అంచల అప్పీలు వ్యవస్థను తీసుకువచ్చిందన్నారు. అదేవిధంగా వారసత్వంగా సంక్రమించే భూముల మ్యూటేషన్ల విషయంలో నోటీసులు జారీ చేయాల్సిన ప్రక్రియపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. భూ భారతి చట్టం 2025 ప్రకారం ఒకరోజు రిజిస్ట్రేషన్ తో పాటు మ్యుటేషన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అంతేకాకుండా ప్రతి ఒక్కభూకమతానికి యూనిక్ ఐడి భూదార్ ఇవ్వడం గురించి కూడా తెలియజేశారు. ప్రభుత్వ భూముల గురించి మాట్లాడుతూ ప్రతి మండలంలో గవర్నమెంట్ ల్యాండ్ బ్యాంక్ నిర్వహించాలని, ఏ సర్వే నెంబర్లో ఎంత ల్యాండ్ ఉంది అది ఏ పరిస్థితిలో ఉందనే వివరాలను క్రమ పద్ధతిలో ఉంచుకోవాలని సూచించారు. రైతులకు అవగాహన కార్యక్రమాలు భూ భారతి చట్టం 2025 పై రైతులకు అవగాహన కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. ఏప్రిల్ 17 నుండి మండలాల వారీగా రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి చట్టంపై అవగాహన, అనుమానాలను నివృత్తి చేయాలని సూచించారు. రైతులతో అవగాహన కార్యక్రమాల కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అర్హులను గుర్తించాలి వనపర్తి జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి పైలెట్ గ్రామాలు కాకుండా మండలాల వారీగా అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలతో సమావేశం నిర్వహించి నిజమైన అర్హులను గుర్తించే బాధ్యతను అప్పగించాలన్నారు. నిజంగా నిరుపేదలైన వారికే ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితాలో చోటు ఇవ్వాలని ఇందిరమ్మ కమిటీ ఇలా సభ్యులకు తెలియజేయాలన్నారు. ఏప్రిల్ 21 నాటికి ఈ ప్రక్రియ పూర్తి కావాలని, ఆ తర్వాత ఏప్రిల్ 22 నుంచి ఏప్రిల్ 30 వరకు ప్రత్యేక అధికారులను నియమించి ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన జాబితాలను వెరిఫై చేసి వారు నిజంగా అర్హులైన కాదా తేల్చాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అనర్హులకు జాబితాలో చోటు లేకుండా చూడాలన్నారు. తాగునీటి ఇబ్బందులు రానివ్వద్దు వేసవిని దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాలుగా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. స్థానికంగా ఉండే నీటి వనరులను సిద్ధం చేసుకోవాలని ఎంపీడీవోలకు సూచించారు. స్థానిక నీటి వనరులకు సంబంధించి ఏమైనా మరమ్మత్తులు చేసేది ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీలలో వాటర్ ట్యాంకర్లను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా తహసిల్దార్లకు, డిప్యూటీ తహసిల్దార్లకు, ఆర్ఐలకు భూభారతి చట్టంపై అవగాహన గురించి పరీక్షను నిర్వహించారు. సమావేశంలో తహసిల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కులాంతర వివాహ ప్రోత్సాహక బహుమతిని అందజేసిన జిల్లా కలెక్టర్

**గద్వాల, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** కులాంతర వివాహం చేసుకున్న జంటకు బుధవారం ఐడీఓసీ కార్యాలయంలోని తన ఛాంబర్ నందు ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతిని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ మంజూరు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. గద్వాల పట్టణానికి చెందిన టి.యం. మౌనిక (వైఫ్ ఆఫ్ కె.రమేష్) ఎస్సీ కులాంతర వివాహం చేసుకు న్నందుకు, ప్రభుత్వ కల్పించిన పథకం ద్వారా 2,50,000 ప్రోత్సాహక బహుమతిని మంజూ రైనట్టు తెలిపారు. ఈ మొత్తాన్ని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో జంటకు బాండ్‌ను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసంక్షేమ శాఖ అధికారి సరోజ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రోత్సాహక బహుమతిని అందజేసిన జిల్లా కలెక్టర్ సంతోష్

## బిఆర్ఎస్ రజితోత్సవ సభను విజయవంతం చేయాలి

■ పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి

**గండీడ్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** ఈ నెల 27వ తేదీన వరంగల్ లోని ఎల్కతుర్తి లో నిర్వహిస్తున్న బిఆర్ఎస్ రజితోత్సవ సభకు పరిగి నియోజకవర్గం నుండి బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు అత్యధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పరిగి మాజీ శాసనసభ్యులు కొప్పుల మహేష్ రెడ్డి పిలుపునిచ్చారు. గండీడ్ మండల కేంద్రంలో నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం అనంతరం ఆయన "ప్రభాతవార్త" తో మాట్లాడుతూ ఆనాటి ఉద్యమ చరిత్రను మరోసారి చాటి చెప్పే ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ కాంగ్రెస్ ను అంతమొందించేందుకు పోరాటాల ఖిల్లా ఓరుగల్లు జిల్లా నుండే సమర శంఖం పూరించనున్న గులాబీ దళపతి కేసీఆర్ కు పరిగి నియోజకవర్గం గులాబీ శ్రేణులు పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై దండయాత్ర చేయుటకు బిఆర్ఎస్ శ్రేణులుఈ సభకుభారీ సంఖ్యలో హాజరై పరిగి సత్తా చాటాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బిఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తు వేధిస్తున్నారని ఆయన ఆరోపించారు. బిఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు ఉద్యమాలు, కేసులుకొత్తేమీ కాదన్న విషయాన్ని కాంగ్రెస్‌నాయకులు గమనించాలని ఆయన సూచించారు. పార్టీ శ్రేణులు అక్రమ కేసులకు భయపడాల్సిన అవసరం లేదని, పార్టీతో పాటు కార్యకర్తలకు, నాయకులకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని మహేష్ రెడ్డి హామీ ఇచ్చారు. ఎన్నికల ముందు ఆచరణకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను పక్కన పెట్టి ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చేస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ కు ప్రజల నుండి పెద్ద ఎత్తున వ్యతిరేకత కనిపిస్తుందని, అందుకే కాంగ్రెస్ మంత్రులు ఎమ్మెల్యేలు సహనం కోల్పోయి ఇచ్చిన హామీలను నెరవేర్చమని అడుగుతున్నా ప్రజలపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇటీవల గండీడ్ మండలంలోనిఓ గ్రామంలో ఓవ్యక్తి గ్రామంలో తాగునీరు లేవని గ్రామానికి వెళ్లిన పరిగి ఎమ్మెల్యేను నిలదీయగా పోలీసుల సహకారంతో ఆయనను ఎమ్మెల్యే బెదిరించారని అన్నారు. కాంగ్రెస్ పై ప్రజలుత్వరలో తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలలో ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఈ విషయాన్ని రాష్ట్ర ప్రజలు గమనించారని అందుకే ప్రజల్లో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పై వ్యతిరేకత వచ్చిందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా రాష్ట్ర ప్రజలు కేసీఆర్ ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి సిద్ధంగా ఉన్నారని మహేష్ రెడ్డికి స్పష్టం చేశారు.

## మంత్రి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్

**మద్దూర్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** భూభారతి పోర్టల్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన మద్దూరు మండలంలోని ఖాజీపూర్‌లో గురువారం నిర్వహించే భూభారతి రెవెన్యూ సదస్సుకు హాజరవుతున్న రెవెన్యూ, పౌర సమాచార సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నందున



మంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న దృశ్యం

ఖాజీపూర్‌లోబుధవారం మంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లాకలెక్టర్ సిక్తా పట్నాయక్ పర్యవేక్షించారు. గ్రామంలోని రెండు స్థలాలను చూసిన కలెక్టర్ మండల పరిషత్ పాఠశాల ఎదురుగా ఉన్న స్థలంలో భూభారతి రెవెన్యూ సదస్సుకు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో భూ భారతి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా గురువారం రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భూభారతి సదస్సునుమండలంలోని ఖాజీపూర్‌లో ప్రారంభించనున్నారు. అందుకోసం ఖాజీపూంలో ఏర్పాట్లను కలెక్టర్ దగ్గరుండి పరిశీలించారు. మంత్రిచే ప్రారంభించే భూభారతి సదస్సుకు అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్ షాలోమ్, ఆర్డిఓ రామచందర్ నాయక్, మద్దూర్ తహసిల్దార్ మహేష్ గౌడ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

**తెలకపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** పల్లెలు ప్రగతి పథంలో అభివృద్ధి చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరంతరం పేద ప్రజలఅభివృద్ధికి కృషి చేస్తున్నదని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డా.కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని గౌతమ్‌పల్లి గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ కింద మంజూరైన సీసీరోడ్డు నిర్మాణానికి వారు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ఎన్నో రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని వాటిని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్ళపల్లి యాదయ్య, గ్రామ మాజీ సర్పంచ్ యాదవ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్స్, గ్రామనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే డా. కూచుకుల్ల రాజేష్ రెడ్డి

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

**మద్దూర్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** మద్దూర్ మండల కేంద్రంలో సింగిల్‌విండోఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో సౌకర్యాలు పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ప్రారంభమైనప్పటి నుంచి ఇంత వరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారని నిర్వాహకులను ఆమె అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం లో తేమ కొలిచే యంత్రంతో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. నిర్ణీత తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి కొనుగోలు చేయాలని ఆమె ఆదేశించారు కొనుగోలు చేసిన ధాన్యం ను ట్యాగ్ చేసినమిల్లుకు రవాణాచేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంకు వచ్చినధాన్యం తేమ శాతం పరిశీలించి రైతులకు వ్యవ సాయ అధికారులుటోకెన్లు జారీచేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంకు తూర్పారపట్టి, ఆరపోసి, తాలు, మట్టిలేని నాణ్య త ప్రమణాల ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. అకాల వర్షాలు కురుస్తున్నదునరైతులు ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం శుభ్రం చేయుటకుప్యాడీ క్లీనర్, టార్పాలిన్‌లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. అనంతరం కలెక్టర్ పల్లె గడ్డ గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకెపి వరికొనుగోలు కేంద్రాన్ని కూడాతనిఖీ చేసి అక్కడి నిర్వాహకులకువరి కొనుగోలుకు సంబంధించి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్ షాలోమ్, తహసిల్దార్, రెవెన్యూ, సింగిల్ విండో అధికారులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రంలో తేమ శాతం పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

## జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణకు ఎంపికి ఆహ్వానం

**ఆత్మకూరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో ఈనెల 23వ తేదీన బాబు జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణకుతమకు చేయూతనందించి సభను నడిపించాలని ఆత్మకూరు మండలానికి చెందిన అంబేద్కర్ యువజన సంఘం, దళిత సంఘాల నేతలు బుధవారం మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మను మహబూబ్‌నగర్‌లో కలిసి విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి ఆత్మకూరు మండలంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ఆవిష్కరణకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ రానున్న నేపథ్యంలో ఆర్థిక సహకారంతో పాటుగా సభను నడిపించేందుకు పార్లమెంటు సభ్యులుగా ముందుండి నడిపించేందుకు తమకు చేయూతనందించాలని వారు విజ్ఞప్తి చేయడంతో డీకే అరుణమ్మ బదిలీస్తూ భారత దేశానికి దిశా నిర్దేశం చూపిన బాబు జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ ఎంతో ప్రత్యేకమైనదని తప్పకుండా తాను హాజరు కావడమే కాకుండా అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకుంటానని స్పష్టమైన హామీ ఇచ్చినట్లుగా దళిత సంఘాల నాయకులు తెలిపారు. ఎంపీడీకే అరుణమ్మను కలిసివిజ్ఞప్తి చేసిన వారిలోఅంబేద్కర్ యువజన సంఘం నాయకులు జానకిరాములు, గాలి పంపు శ్రీనివాసులు, శోభన్ బాబు, ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆజపాక లక్ష్మణ్ ,దండు శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణకు హాజరు కావాలంటూ డీకే అరుణమ్మకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

## గుర్తు తెలియని వాహనం ఢీ: ఒకరు మృతి

**మానవపాడు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొన్న ఘటనలో బైకుపై ప్రయాణిస్తున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గద్వాల జిల్లా మానవపాడు మండలం 44వ జాతీయ రహదారిపై బుధవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్సై చంద్రకాంత్ తెలిపిన వివరాల ప్రకారం వనపర్తి జిల్లా పెద్దమారు గ్రామానికి చెందిన కాశీనాథ్ నాయుడు 32 కర్నూల్ పట్టణంలోని ఓ ఆటో షోరూంలో మెకానిక్ పని చేస్తున్నాడు. పనులు ముగించుకొని బుధవారం ఉదయం కర్నూల్ నుండి తమ స్వగ్రామానికి బైక్ మీదవెళ్తుండగా మానవపాడు క్రాస్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొనగా బైక్‌మీద ఉన్నకాశీనాథ్ నాయుడు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం అంబులెన్స్ లో కర్నూలులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో చనిపోయినట్లు ఎస్సై పేర్కొన్నారు. ప్రమాదానికి సంబంధించి మృతుని భార్య గాయత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## చెరువులో గల్లంతయిన వ్యక్తి మృతదేహం లభ్యం

**బాలానగర్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** బాలానగర్ మండలంలోని మోతిఘనపూర్ పెద్ద చెరువులో సోమవారం మధ్యాహ్నం చేపలు పట్టేందుకు వెళ్లి గ్రామానికి చెందిన శివ రాములు, యాదగిరి గల్లంతైన విషయం తెలిసిందే. పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సోమవారం గాలింపు చేపట్టిన మృతదేహాలు లభించలేదు. మంగళవారం సాయంత్రంశివరాములు మృతదేహం లభ్యం అయింది. బుధవారం ఎస్ఐ లెనిన్ ఆధ్వర్యంలో మరోసారి గాలింపు చేపట్టగ, యాదగిరి (25)మృతదేహంలభ్యమయ్యింది. పోస్టుమార్టంనిమిత్తం యాదయ్య మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒకే ఊరికి చెందిన ఇద్దరు వ్యక్తులు మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలో అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**తెలకపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని 33 కెవి తెల్కపల్లి లైన్ కింద చెట్లు కొట్టడం కోసం గురువారం ఉదయం 7 గంటల నుంచి 12 గంటల మధ్యలో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శాంతన్ తేజ బుధవారం తెలిపారు. మండల పరిధిలోనిచిన్నముద్దునూర్, తాళ్లపల్లి, అదేవిధంగా నాగర్ కర్నూల్ మండల పరిధిలోని పుల్జల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. కాబట్టి వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించగలరని వారు కోరారు.

## 5వ మహాసభలు జయప్రదం చేయండి

**మద్దూర్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మద్దూర్ పట్టణ కేంద్రంలో బుధవారం రోజు భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ మద్దూర్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బాలికల స్కూల్, గీతాంజలి స్కూల్ సాంఘిక సంక్షేమ షెడ్యూల్ కులాల సంక్షేమ హాస్టల్ దగ్గర ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టరు విడుదల చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మహేష్, నరేష్ ,రాజు ,వివిధ పాఠశాలల విద్యార్థి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


## కుంచె పట్టిన మాజీ ఎమ్మెల్యే చిట్టెం




గోడపై రాస్తున్న మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

**మక్తల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** ఈ నెల 27న వరంగల్ లో జరిగే బిఆర్ఎస్ రజతోత్సవ సభకు సంబంధించిన ప్రచారంలో భాగంగా బుధవారం మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి కుంచె పట్టి కళాకారుడిగా మారారు. మక్తల్ పట్టణంలోని ప్రధానరహదారి పక్కన గల గోడలపై స్వయంగా కుంచె పట్టి వాల్ రైటింగ్ రాస్తూ చూపరులను, బిఆర్ఎస్ శ్రేణులను ఆకట్టుకున్నారు. మక్తల్ నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు రజతోత్సవ సభకు తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నరసింహ గౌడ్, కే.రాజేష్‌గౌడ్, నాయకులు ఎల్లారెడ్డి, జుట్ల చిన్న హనుమంతు, జుట్ల శంకర్, గవినోళ్ల నరసింహారెడ్డి, బండారి ఆనంద్, జుట్ల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి పరామర్శ



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న తల్లోజు ఆచారి

**కల్వకుర్తి, ఏప్రిల్16 ప్రభాతవార్త:** కలన్వకుర్తి పట్టణానికి చెందిన బీజేపీ కార్యకర్త కాసుల అరవిండ్‌చారి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి బుధవారం మృతుడి నివాసానికిచేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.50 వేల ఆర్థిక సహాయంఅందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో అతని కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. పరామర్శించిన వారిలో బిజెపిరాష్ట్ర, జిల్లా, తాలూకా నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సంగంబండలో వడ్ల కొనుగోలు ప్రారంభం

**మక్తల్ టౌన్, ఏప్రిల్16 ప్రభాతవార్త:** రైతులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకరావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.2320 చెల్లిస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చుసుకోవాల్సిందిగా పిఎసిఎస్ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాములు సార్, డైరెక్టర్ మహాదేవప్ప గ్రామ పెద్దలు యువకులు రైతులు కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## ఊర కుక్కల దాడిలో గాయపడ్డ జింక



**బిజినేపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** గంగారం బీటు పరిధిలోని కీమ్యా తాండ గ్రామపంచాయతీ సమీపంలోని బుధవారం జింకపై ఊర కుక్కలు దాడి చేసి గాయపర్చిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్ఆర్వో దేవరాజు తెలిపిన వివరాల మేరకు వేసవికాలం కావడంతో ఆటవీ ప్రాంతం నుంచి నీటి కోసం తాండ సమీపంలోని పోలాలకు జింక వచ్చిందన్నారు. జింకను గమనించిన ఊరకుక్కలు జింక పై దాడి చేసి కాళ్లపై గాయాలు చేశాయి. గమనించిన తాండవాసులు ఊరకుక్కలను తరిమి జింకను రక్షించారు. విషయం తెలుసుకున్నఎస్ఆర్వో దేవరాజు ఘటన స్థలానికి చేరుకొని జింక వెళ్ళిన ఆటవీలోకి వెళ్ళి జింక పరిస్థితిని పరిశీలించారు. ఆటవీ లోపలికి జింక సురక్షితంగా వెళ్ళడంతో జింకకు ప్రాణాపాయం తప్పిందన్నారు.

## రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

**నవాబుపేట, ఏప్రిల్16 ప్రభాతవార్త:** ప్రభుత్వం, రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల రైతులు వినియోగించుకోవాలని మాజీ డిసిసి అధికార ప్రతినిధి మార్కెట్ కమిటీ చైర్మన్ హరలింగం కోరారు. బుధవారం మండల పరిధిలోని కొండాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక పీఏసీఎస్ చైర్మన్ సమక్షంలో మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిసిసి మాజీ అధికార ప్రతినిధి దుష్యంత్‌రెడ్డి ఏఎంసీ చైర్మన్ హరలింగం మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ కృషి చేస్తోందని, పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామన్నారు. దళారులను నమ్మి చేతికొచ్చిన పంటను దళారుల చేతిలో పెట్టి రైతులు మోసపోవద్దని తెలిపారు. సన్నరకం వడ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 500 బోనస్ ప్రకటించిన విషయం తెలిసిందే. రైతులు దీన్ని సద్వినియోగంచేసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామ కాంగ్రెస్ కార్యకర్త దోరేమోనీ మల్లేష్ యాదవ్ పెళ్లికి హాజరై నూతన వధూవరులనుఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులతో పాటు గ్రామ నాయకులు కొత్త గొల్ల బాలరాజు గ్రామకాంగ్రెస్ నాయకులు, మహిళా అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## జడ్చర్లలో ఫైర్ సిబ్బంది అవగాహన

**జడ్చర్ల, ఏప్రిల్16 ప్రభాతవార్త:** జాతీయ అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మూడవరోజు నివాస భవనాల్లో కాలనీలో అపార్ట్మెంట్లలో జడ్చర్ల ఫైర్ సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. జడ్చర్ల పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలోని శ్రీనివాస టవర్స్‌లో ముఖ్యంగా ఎల్పిజి సిలిండర్‌లు లీక్ అయినప్పుడు జరిగే ప్రమాదాలు, వివిధ రకాల అగ్నిమాపక పరికరాలను ఉపయోగించే విధానాన్ని చూపించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజేందర్, ఎల్ఎఫ్‌జి రాఘవేందర్, సురేష్ ,నవీన్ కుమార్, ప్రేమ్ కుమార్‌రెడ్డి, మోహన్, మజీద్ పాల్గొన్నారు.

## బీఎంసీ భవన నిర్మాణానికై ఎమ్మెల్యేకు వినతి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్16 ప్రభాతవార్త:** విజయ పాలశీతలీకరణ బిఎంసి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ బిఎంసియు అధ్యక్షులు ఎండి యాకూబ్ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి మండల కేంద్రంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంబిఎంసీఅధ్యక్షులు ఎండి యాకూబ్ మాట్లాడుతూ 5వేల పాల లీటర్ల సామర్థ్యం గల బిఎంసియు ప్రైవేటు అద్దె భవనంలో అరకొర వసతులతో నడుస్తుందని, 14 గ్రామాల నుండి సుమారు 500 మంది పాడి రైతుల నుండి పాల సేకరణ చేపడుతున్నామన్నారు. 5వేల నుండి13వేల లీటర్ల సామర్థ్యంపెంచుకొనుటకై పక్కా భవన నిర్మాణం చేపడితే పాడి రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి భవన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు.

## గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలి

**మానవపాడు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** నిరుద్యోగ యువత, ప్రజలు గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం గ్రంథాలయంలో ఉన్నటువంటి పుస్తకాలను, రికార్డులను తనిఖీ చేశారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేస్తామని నిరుద్యోగులు గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని పుస్తకాలను చదివి విజ్ఞానం పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లెపోగు రమేష్, ధర్మవరం డీలర్‌విద్యాసాగర్, జగ్గుల ప్రభాకర్ పాల్గొన్నారు.

## డీఈఓకు వినతి

**నారాయణపేట టౌన్, ఏప్రిల్16 ప్రభావతవార్త:** అంబేద్కర్ జయంతి రోజు జాతీయ సెలవు దినం ఉన్నప్పటికీ పాఠశాలను కొనసాగించిన నారాయణపేట జిల్లా కేంద్రంలోని వేదాంత పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం విశ్వహిందూ పరిషత్ నాయకుల ఆధ్వర్యంలో డీఈఓకు వినతి పత్రం అందజేశారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ సభ్యులు మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి రోజు జాతీయ సెలవు ఉన్నప్పటికీ పాఠశాలను కొనసాగించడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరించిన యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు డా. రాంబాబు, కన్న శివకుమార్, కదుదాస్ ప్రవీణ్, రామకృష్ణ, సునీత, మహేశ్వరి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెలు, మేకలకు ఉచిత టీకాలు వేయించుకోవాలి

**ఇటిక్యాల, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** మండల పరిధిలోని గ్రామాలలో గొర్రెలు మేకలు ఉన్న యజమానులు పశువర్ధక శాఖ ఆధ్వర్యంలో వేసే ఉచిత టీకాలు వాటికి వేయించుకోవాలని పశువైద్య డా. భువనేశ్వరి తెలిపారు. బుధవారం కొండేరు గ్రామంలో మూడు నెలలు వయస్సు పైబడిన అన్ని రకాల జీవాలకు ఉచిత టీకాలు వేయగా దాదాపు 8 వందల జీవాలకు ఉచిత అమ్మ తల్లి వ్యాధి నిరోధకటీకాలు వేసినట్లు మండల పశువైద్య డా. భువనేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్రలు విజయభాస్కర్, దేవన్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలి

**వనపర్తి క్రైమ్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** బుధవారం రేవల్లి నూతన ఎస్సై వి. రజిత, జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని శాంతి భద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వి.రజిత, జోగులాంబ గద్వాల్ జిల్లా డిసిఆర్బి ఎస్సైగా విధులు నిర్వహిస్తూ రేవల్లికి బదిలీపై వచ్చారు. రేవల్లిలో ఎస్సైగా పనిచేసిన రాము వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయానికి బదిలీపై వెళ్ళారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరిస్తూ ఆమె ప్రజలను కోరారు.

## ఆస్తి పంచలేదని తండ్రికి కొరివి పెట్టని తనయుడు

■ చిన్న కూతురుతో తలకొరివి పెట్టించి అంత్యక్రియలు

**మహబూబ్‌నగర్,ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** ఆ తండ్రికి ఇద్దరు కూతుళ్లు ఓ కుమారుడు.హైందవ సంప్రదాయం ప్రకారం తండ్రి తనువు చాలిస్తే అంత్యక్రియలు నిర్వహించాల్సిన బాధ్యత కొడుకు. కానీ ఆ తండ్రి తన పేరిట ఉన్న ఇంటిని తనకు కాకుండా తన సోదరిమణి పేరిట రిజిస్ట్రేషన్ చేశాడన్న కోపముతో ఓ కొడుకు తండ్రి కర్మకాండల సంగతి అటుంచి కడసారి చూపు చూసేందుకు రాకపోవడంతో బంధువులు మిత్రులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వివరాలలోకి వెళితే నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం కాన్షన్ పల్లికి చెందిన మాణిక్యరావు (80) సర్వే అండ్ ల్యాండ్స్ రికార్డ్స్ డిపార్ట్మెంట్లో అసిస్టెంట్ డైరెక్టర్గా విధులు నిర్వహించాడు. మాణిక్యరావు దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు అందరి వివాహాలు జరిపించాడు. భార్య గతంలోనే మరణించడంతో తనకున్న ఆస్తిలో సొంత ఊరిలో ఉన్న 15 ఎకరాల వ్యవసాయ పొలం, రూ.60 లక్షలు తన కొడుకు గిరీష్ కి ఇచ్చి, మహబూబ్ నగర్ పద్మావతి కాలనీలో ఉన్న ఇంటిని ఆర్థికంగా బలహీనంగాఉన్న పెద్ద కూతురురాజనందిని పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. ఇంటిలో బిడ్డల సంరక్షణలో ఉన్న మాణిక్యరావు అనారోగ్యానికి గురై మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మరణించినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. హైదరాబాదులో ఉన్న గిరీష్కు సోదరిమణులు విషయాన్ని తెలియజేశారు. ఇంటిని తనకు కాకుండా చేశాడు నేను అంత్యక్రియలకు రాను అని గిరీష్ చెప్పడంతో ఆసోదరీమణులు అన్న ఆఇంటిని ముగ్గురంసమానంగా తీసుకుందాం నాన్న అంత్యక్రియలు నిర్వహించేందుకు రా అంటే అతను రానని కరాఖండిగా చెప్పాడు. బంధువులు మిత్రులు ఎంతగా చెప్పినా రాను అని తేల్చి చెప్పాడు. అంతకుముందే అక్కడికి చేరుకున్న సీనియర్ సిటిజెన్ ఫోరం సభ్యులు మీరు అంత్యక్రియలు నిర్వహించకుంటే మేము నిర్వహిస్తాం అని గట్టిగా చెప్పడంతో బంధువులు, మిత్రులు కుమారుడు రాకున్నా అంత్యక్రియలు నిర్వహించేందుకు సిద్ధం అయ్యారు. చిన్న కూతురు రఘు నందిని అంతిమ యాత్ర ముందు నడిచి తండ్రికి తలకొరివి పెట్టింది. తండ్రి పై మమకారంకన్నా..ఆస్తికేప్రాధాన్యతనిచ్చిన కొడుకుపట్లసర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

## భార్యాభర్తల మధ్య తగాదాలతో భర్త ఆత్మహత్య

**గండీడ్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** భార్యాభర్తల మధ్య తగాదాలతో భర్త ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గండీడ్ మండలం పూర్యానాయక్ తండాలో మంగళవారం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గండీడ్ మండలం పూర్య నాయక్ తండాకు చెందిన అంజి బాయ్‌కి ఫరూక్‌నగర్ మండలం పటేల్ చెరువు తండా చించోడుకు చెందిన తుల్యా నాయక్ కు వివాహం జరిగింది. వీరు గత కొన్ని సంవత్సరాల నుండి మహారాష్ట్రలో కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. పిల్లలకు వేసవి సెలవులు వచ్చాయని గత నాలుగు రోజుల క్రితం భార్యాభర్తలిద్దరూ గండీడ్ మండలం పూర్యానాయక్ తండాకు వచ్చారు. ఇక్కడే ఉంటు వారి పిల్లలు మనసూర్ పల్లి తండా ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారు. అయితే పిల్లలకు వేసవి సెలవు లు వస్తున్న నేపథ్యంలో పిల్లలను తుల్యానాయక్ తన స్వగ్రామానికి తీసుకు వెళ్లాలన్న విషయంపై భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో తుల్య నాయక్ (35) మనస్తాపానికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే అంజి బాయ్ కుటుంబ సభ్యులు హుటాహుటిన కోస్గి ఆసుపత్రికి తరలించగా అప్పటికే తుల్యానాయక్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

### నేటి నుండి 29 వరకు మండల స్థాయిలో

## భూ భారతి అవగాహన సదస్సులు

● మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** భూ భారతి చట్టంపై నేటి నుండి ఈ నెల 29 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలోని మండలాల్లో రోజువారీగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయిఒక ప్రకటనలో తెలిపారు. నేడు బుధవారం ఉదయం9 గం.ల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జడ్చర్లలో ఈ నెల 19న గండీడ్ మండలంలో ఉదయం 9 గం.ల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మహమ్మదాబాద్ మండలంలో మధ్యాహ్నం 2 గం.ల నుండి సాయంత్రం 6 గం.ల వరకు, ఈ నెల 21 న అడ్డాకల్ మండలంలో ఉదయం 9 గం.ల నుండి మధ్యాహ్నం 1:00 వరకు, మూసాపేట మండలంలో మధ్యాహ్నం 2 గం.ల నుండి సాయంత్రం 6 గం.ల వరకు, ఈ నెల 22న మిడ్జిల్ మండలంలో ఉదయం 9 గ.టల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, భూత్పూర్ మండలంలో మధ్యాహ్నం 2 గం.ల నుండి సాయంత్రం 6 గం.ల వరకు, ఈ నెల 23న సీసీ కుంట మండలంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం1:00 వరకు, కౌకుంట్ల మండలంలో మధ్యాహ్నం 2 గం.ల నుండి సాయంత్రం 6 గంటల వరకు, ఈ నెల 24న కోయిలకొండ మండలంలో ఉదయం 9 గం.ల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, హన్వాడ మండలంలో మధ్యాహ్నం 2 గం.ల నుండి సాయంత్రం 6 గం.ల వరకు, ఈ నెల 25న దేవరకద్ర మండలంలో ఉదయం 9 గం.ల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మహబూబ్ నగర్ రూరల్ మండలంలో మధ్యాహ్నం 2 గం.ల నుండి సాయంత్రం 6 గం.ల వరకు, ఈ నెల 26న మహబూబ్ నగర్ అర్బన్ మండలంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు, ఈ నెల 28న నవాబుపేట మండలంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు, ఈ నెల 29 న బాలానగర్ మండలంలో ఉదయం 9 గం.ల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, రాజాపూర్ మండలంలో మధ్యాహ్నం 2 గం.ల నుండి సాయంత్రం 6 గం.ల వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సదస్సులో ప్రజా ప్రతినిధులు,రెవెన్యూ అధికారులు పాల్గొని భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కలిగించనున్నట్లు ఆమెతెలిపారు. రైతులు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అవగాహన సదస్సులు విజయవంతం చేయాలని కలెక్టర్ ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

## గురుకులాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు గ్రీన్ బోర్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

**బిజినేపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** గురుకులాల్లో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని విద్యార్థుల సైతం ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి సూచించారు. బిజినేపల్లి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కాలేజీ విద్యార్థుల కోసం కూచుకుల్ల ఫౌండేషన్ తరపున 10 గ్రీన్ బోర్డులను అందించారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నతమైన మెనూ సిద్ధం చేసి విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తుందని గుర్తు చేశారు. గురుకుల విద్యార్థులు బాగా చదివి ప్రైవేటుకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. విద్యార్థులపై పెట్టే ప్రతి పైసా దేశాభివృద్ధి కోసం పెట్టే పైసాగాభావించాలన్నారు. విద్యార్థివి.యశ్వంత్ ఎమ్మెల్యే చిత్రపటానికి బహుమతిగా అందించడంతో విద్యార్థిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుమతి, ఎంపీడీవో కథలప్ప,ఎస్ఎంసి కమిటీ చైర్మన్ మస్కూరిశంకర్, పిఏసిఎస్ మాజీ చైర్మన్ మలిశెట్టి వెంకటస్వామి, మాజీ సర్పంచులు గంగనమోని తిరుపతయ్య, అమృత్ రెడ్డి, మిద్దెరాములు, మాన్య నాయక్,హరీష్‌రెడ్డి, ముక్తార్‌పాషా,బంగారి పర్వతాలు, కృష్ణారెడ్డి, రాముానాయక్ గోవింద నాయక్, శ్రీనివాస్ గౌడ్, చంద్రగౌడ్, నరేందర్ గౌడ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## చిరుతపులి, పెద్దపులి దాడిలో మృతి చెందిన పశువుల కుటుంబాలకు నష్టపరిహారం అందజేత



**లింగాల, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** పెద్దపులి, చిరుతపులి దాడిలో మృతి చెందిన వివిధ జంతువు కుటుంబాలకు నష్టపరిహారం అందజేసినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఈశ్వర్ తెలిపారు. బుధవారం మండలంలోని ఫారెస్ట్‌రేంజ్ కార్యాలయంలో మారెడు దిన్నె గ్రామానికి చెందిన సూఫారి బాలయ్య కుటుంబానికి రూ.13 వేలు, క్యాంపు రాయవరం గ్రామానికి సూర శేఖర్ కుటుంబానికి రూ.10 వేలు, పాత ధారారం గ్రామానికి మహేష్ కుటుంబానికి రూ. 10 వేలు బాధిత కుటుంబాలకు అందజేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా గతంలో చిరుతపులి, పెద్దపులి దాడిలో మృతి పశువులు వాటిని ఉన్నతాధికారులు పరిశీలించిన అనంతరం బాధితులకు నష్టపరిహారం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైదేవ్, రాంబాబు, ఖాదర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## నేడు మిషన్ భగీరథ నీళ్ల సరఫరా నిలిపివేత

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** అత్యవసర పరిస్థితుల నిమిత్తం మాన్యంకొండ డబ్ల్యూటీపికి త్రాగునీరు సరఫరా అయ్యే గుడిపల్లి గుట్టవద్ద పైప్‌లైన్ లీకేజి కారణంగా మరమ్మత్తు పనుల నిమిత్తం నేడు మాన్యంకొండ డబ్ల్యూటీపి నుండి త్రాగునిటీ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని నారాయణపేట ఏఈ మిషన్ భగీరథ గ్రిడ్ తెలిజేశారు. గుడిపల్లి గుట్ట 1700 ఎంఎస్ లైన్ లీకేజి మరమ్మత్తు అనంతరం యధావిధిగా చేయబడుతుందని అన్నారు. మరమ్మత్తు అయ్యేవరకు సహకరించాలన్నారు.

# పోటాపోటీగా వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

◆ముందుగా మార్కెట్ చైర్మన్.. ఆ వెంటనే అలంపూర్ ఎమ్మెల్యే

◆రెండు పార్టీల మధ్య అధికారులకు తప్పని ఇబ్బందులు

**ఇటిక్యాల, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** జూరాల ఆయకట్టు కింద మండల పరిధిలోని కొండేరు జింకలపల్లి గ్రామాలలో రైతులు రబీ సీజన్ కింద వరిని పండించగా ప్రభుత్వం ద్వారా రైతులు పండించిన వరిని కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకోగా బుధవారం ఉదయం కొండేరు గ్రామంలో ముందుగానే అల్లంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప అక్కడికి చేరుకొని మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రుక్మానందరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, కొండేరు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోతురాజు సోమనాద్రి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప వరి కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. అదేవిధంగా జింకలపల్లి గ్రామంలో కూడా వారు వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బీచుపల్లి. సిరాజ్. తదితరులు పాల్గొన్నారు.



కొండేరులో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబిస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే

**కొండేరులో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అలంపూర్ ఎమ్మెల్యే:** మండల పరిధిలోని కొండేరు స్టేజి సమీపంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించిన 20 నిమిషాల అనంతరం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అక్కడికి చేరుకొని కొండేరు మాజీ సర్పంచ్ వీరన్న టిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి వరికొనుగోలు కేంద్రాన్ని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ప్రారంభించారు. దీంతో కొండేరు స్టేజిలో వరి కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ నుండి మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, బిఆర్ఎస్ పార్టీ నుండి అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడు పోటాపోటీగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ వరి పండించిన రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి 17 తేమ ఉండేలా చూసుకోవాలని అలాంటి వారికి ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2320 మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. కాకా కొండేరు గ్రామంలో వరి కొనుగోలు కేంద్రానికి తాను హాజరవుతానని ఐకెపి అధికారులకు సమాచారం ఇవ్వగా ఎమ్మెల్యే రాక ముందు కాంగ్రెస్ పార్టీ వారు ప్రారంభించడంతో ప్రోటోకాల్ పాటించడం లేదని ఐకెపి అధికారులపై ఎమ్మెల్యే మండిపడ్డారు. అంతేకాక మంగళవారం కూడా ఇలాంటి ఘటన చోటు చేసుకుంది. వాస్తవానికి వరి కొనుగోలు కేంద్రాన్ని నిన్ననే ప్రారంభించాల్సి ఉండగా బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కడికి చేరుకోగా కాంగ్రెస్ పార్టీ మార్కెట్ కమిటీ చెందిన వారి పేర్లు లేకపోవడం సమస్య పెద్దదిగా మారిపోయింది.అవన్నీ పట్టించుకోకుండానే గ్రామసంఘం లీడర్లతో కలిసి బిఆర్ఎస్ పార్టీ నాయకులు హడావుడిగా వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించుకున్నారు. వారికి ప్రోటోకాల్ లేకపోవడంతో తిరిగి బుధవారం అటు ముందుగా కాంగ్రెస్ పార్టీకి చెందిన మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప 20 నిమిషాలఅనంతరం ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీకి చెందిన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు హాజరై ప్రారంభించారు. దీంతో కొండేరులో ఏ ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించాలన్న స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే వరకూ అన్ని శాఖల అధికారులకు ఇబ్బందులు తప్పవు. ఈ కార్యక్రమంలో ఏపిఎం కురుమన్న, సిసి బీచుపల్లి, గ్రామ సంఘం మహిళా లీడర్లు పద్మమ్మ, మార్తమ్మ, లక్ష్మిదేవి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు బి.వీరన్న, శేషు. వీరబాబు, ప్రకాశం, యోహాన్ తదితరులు పాల్గొన్నారు.



కొండేరులో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, కాంగ్రెస్ పార్టీ నాయకులు

## రైతులు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి



**మహబూబ్‌నగర్ బ్యూరో,ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** హన్వాడ మండలం నాగినోనిపల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తనిఖీ చేశారు.ధాన్యం కొనుగోలు కేంద్రంలో సౌకర్యాలు పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ప్రారంభమైనప్పటికి గన్నీ సంచులు లేకపోవడం గమనించి పౌర సరఫరాల సంస్థ నుండి వెంటనే గన్నిలకు ఇండెంట్ పెట్టి తీసుకోవాలని ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు గన్నిలు అవసరం మేర సరఫరా చేయాలని పౌర సరఫరాల సంస్థ డిఎంతో మాట్లాడి సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమ కొలిచే యంత్రంతో ధాన్యం తేమశాతం పరిశీలించారు. నిర్ణీత తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి కొనుగోలు చేయాలని ఆదేశించారు కొనుగోలు చేసిన ధాన్యంను టాగ్ చేసిన మిల్లుకు రవాణా చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంకు వచ్చిన ధాన్యంతేమ శాతం పరిశీలించి రైతులకు వ్యవసాయ అధికారులు టోకెన్లు జారీ చేయాలని అన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రంకు వచ్చిన రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రంకు తూర్పార పట్టి, ఆర పోసి,తాలు,మట్టి లేని నాణ్యత ప్రమణాల ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. అకాల వర్షాలు కురుస్తున్నదున రైతులు ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం శుభ్రం చేయుటకు ప్యాడీ క్లీనర్, టార్పాలిన్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట తహశీల్దార్ కిష్టా నాయక్, ఎంపిడిఓ యశోద, డిపిఎం చెన్నయ్య తదితరులు ఉన్నారు. ఈజీఎస్ పనులు పరిశీలించిన కలెక్టర్ గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కుంట పూడిక పనులు చేస్తున్న ఉపాధి కూలీలతో కలెక్టర్ మాట్లాడిపనులు పరిశీలించారు. ఉపాధి కూలీలను ఏ సమయంకు వస్తున్నారు. ఎన్నిగంటలు పని చేస్తున్నారు. కొలతలుఎలా తీస్తున్నారు అడిగి తెలుసుకున్నారు. ఉదయం 8 నుండి 11 గంటల వరకు పని చేస్తున్నట్లు తెలిపారు. వేసవి తీవ్రత కారణంగా వడదెబ్బ తగలకుండా పనులుపూర్తి చేసుకోవాలని అన్నారు. పని చేసే చోట ఓ.అర్.ఎస్.పాకెట్లు సిద్ధంగా ఉంచాలని, ఇంటికి తీసుకువెళ్ళ వద్దని సూచించారు. ఉపాధి పనులుగరిష్ట వేతనం వచ్చేలా కొలతలు పనులు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎంపిడిఓ యశోద, ఏపిఎం తదితరులు ఉన్నారు.

## జిల్లాలో పర్యటించిన స్టేట్ చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యులు

శిశుగృహ సందర్శించిన కమిషన్ సభ్యులు



శిశుగృహను సందర్శిస్తున్న సభ్యులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** స్టేట్ చైల్డ్ రైట్స్ కమిషన్ నల్గురు సభ్యుల (ఎస్సిపిసిఆర్) బృందం బుధవారం జిల్లాలో పర్యటించారు. కమిషన్ సభ్యులలో వందనగౌడ్, వచన్‌కుమార్, మరిపల్లి చందన, ప్రేమ్‌లత అగర్వాల్‌లు ఉన్నారు. కమిషన్ సభ్యులు ముందుగా శిశుగృహను సందర్శించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి జరీనా బేగం వారికి స్వాగతం పలికారు తర్వాత సభ్యులు శిశుగృహలో పిల్లలగురించి అక్కడపరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక అవసరాలు పిల్లల గురించి సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. ఆ పిల్లలకు అక్యుపేషనల్ థెరపీ, స్పీచ్ థెరపి చేయించాలని ఆదేశించారు. అదేవిధంగా వంటగది సందర్శించి మంచిగా పరిశుభ్రంగా ఉందని కితాబు ఇవ్వడం జరిగింది. జిల్లాలో బాలల కార్మికుల గురించి బాల్య వివాహాల గురించి మాట్లాడుతూ లీగల్ యాక్షన్ పెరగడం వల్ల కేసెస్ రిపోర్టింగ్ పెరుగుతుందని దానివల్ల పిల్లలకు సోషల్ ఎకానమిక్ ఎడ్యుకేషనల్ రిహాబిటేశన్ చేయాలని అన్నారు. అలాగే ప్రతి శిశువుకు ప్రత్యేక కేర్ ప్లాన్ ఉండాలని సూచించారు. ఫోక్సో యాక్ట్ లో సపోర్ట్ పర్సన్ నోటిఫికేషన్ ఇవ్వాలని ఆదేశించారు. స్పెషల్ నీడ్ చిల్డ్రన్‌నుఎలా హ్యాండిల్ చేయాలి అనేది జూమ్ మీటింగ్ ద్వారా కెపాసిటీ బిల్డింగ్ ప్లాన్ చేయాలని సభ్యులు వందన ఆదేశించారు. మెంటల్ ఇల్నెస్ చైల్డ్ విషయంలో కమిషన్ తగిన సహాయం చేస్తుందని తెలిపారు. అలాగే కమిషన్ యొక్క ముఖ్య ఉద్దేశమైన బాలల హక్కుల గురించి గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. డిస్టిక్ ఇన్స్పెక్షన్ కమిటీ గురించి రివ్యూ చేసి క్వార్టర్లీ ఒకసారి చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్ విజిట్ చేయాలని సూచించారు. స్పెషల్ నీడ్ చిల్డ్రన్ ఫుడ్ గురించి వారికి కావలసిన ఉపకరణాల గురించి మాట్లాడడం జరిగింది. పిల్లలకి సంబంధించిన చట్టాలు హక్కులపైన కమిషన్ తగిన సూచనలు సలహాలు ఇస్తుందని అలాగే కెపాసిటీ బిల్డింగ్ కూడా ఇస్తుందని దాని ప్రకారం పని చేయాలని మాట్లాడారు. అలాగే చిల్డ్రన్ ఇన్ కాన్ఫ్లిక్ట్ విత్ లా గురించి ఆరా తీశారు. ఆఫ్టర్ కేర్ ప్రోగ్రాం గురించి ప్రొటెక్షన్ గురించి కమిషన్ రివ్యూ చేయడం జరిగింది. జిల్లాలో అన్ని శాఖలతో సమన్వయం చేసుకొని పని చేయాలని ఆదేశించారు. అదేవిధంగా జువెనైల్ జస్టిస్ బోర్డ్, స్టేట్ హోమ్ విజిట్ చేసితగిన సూచనలు సలహాలు ఇవ్వడంజరిగింది. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి చైర్పర్సన్ నయీమొద్దీన్, సిడబ్ల్యుసి సభ్యులు మాణిక్యప్ప, విజయకుమార్, జెజెబి మెంబర్ ఇస్తేర్ గ్రేస్, సిడిపిఓ శైలశ్రీ, ఏసిడిపిఓ వెంకటమ్మ, డిసిపిఓ నర్మద, శిశుగృహ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేయాలి

● నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక జిల్లాలో పారదర్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత కలిగిన వారినే ఎంపిక చేయాలన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల యాక్షన్ ప్లాన్ పై ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని, గత జనవరి 26న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోస్గి మండలం చంద్రవంచ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించారని, అలాగే ఫిబ్రవరి 21న నారాయణపేట మండలంలోని అప్పక్ పల్లి గ్రామంలో ఓ లబ్ధిదారు రాలికి మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమి పూజ చేశారని కలెక్టర్ ఈసందర్భంగా గుర్తు చేశారు. మండలంలో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి ఈ పథకాన్ని అమలు చేయడంజరిగిందని, ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన వారికి బుధవారం సాయంత్రం వరకు మొదటి విడత రూ. లక్ష వారి ఖాతాలో జమ అవుతుందనే సమాచారం వచ్చిందని కలెక్టర్ తెలిపారు. అలాగే నియోజకవర్గానికి ప్రభుత్వం కేటాయించిన 3500 ఇండ్ల కోసం అర్హత కలిగిన వారినేఎంపిక చేయాలని, జిల్లాలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో చిన్న పొరపాటు కూడా జరగడానికి వీలులేదని ఆమె తేల్చి చెప్పారు. దరఖాస్తు చేసుకున్న వారి వద్దకు వెళ్లి ప్రస్తుతం వాళ్ళు ఉంటున్న ఇంటిని, పై కప్పు ను పరిశీలించిన తర్వాతే ప్రభుత్వ నిబంధనల మేరకు ఎంపిక చేయాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, హౌసింగ్ పీడీ శంకర్, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు ఎంపీడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, హౌసింగ్ ఏఈ లు పాల్గొన్నారు.

## రైతన్నలకు అండగా ప్రజాప్రభుత్వం : ఎమ్మెల్యే



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబిస్తున్న ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

**బిజినేపల్లి, ఏప్రిల్16 ప్రభాతవార్త:** వరిధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరుగుతుందని, రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రజా ప్రభుత్వం రైతన్నలకు అండగా ఉండి చివరి గింజ వరకుకొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే డా. కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. లట్టుపల్లి గ్రామంలోఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఎలాంటి సమస్యలు లేకుండా కొనుగోలు ప్రక్రియను సాఫీగా నిర్వహించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. వరి ధాన్యాన్ని కొనుగోలు చేసిన సంబంధిత రైతు ఖాతాలో నేరుగా డబ్బులు జమ అవుతాయని, రైతన్నలు ఆధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని మాయ మాటలు చెప్పేదళారులకు అమ్మిరైతులు ఎవరు కూడా మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏటీఎం విజయ, ప్రవీణ్, మారేపల్లి చంద్రగౌడ్, గోవింద్ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి రెడ్డి, శేఖర్ రెడ్డి, మిద్దె రాములు వెంకటస్వామి, అమృత్ రెడ్డి, హరీష్ రెడ్డి, ప్రవీణ్, మస్కూరి అవంతి, శంకర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఎస్ఈకి ఘనంగా సన్మానం

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా విద్యుత్తు ఎస్‌సి బాధ్యతలు స్వీకరించిన వెంకటరమణను బుధవారం భారతీయ కిసాన్‌సంఘ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం భారతీయ కిసాన్ సంఘ నాయకులు మాట్లాడుతూ ఈ ప్రాంత రైతుల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎస్‌సిని సన్మానించిన వారిలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబ, జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బాలప్ప, జిల్లా సహాయ కార్యదర్శి ప్రభు మిస్కెన్, జిల్లా కోశాధికారి రంగారెడ్డి పటేల్, నగర అధ్యక్షులు ఆకుల వెంకటప్ప, నగర ఉపాధ్యక్షులు తంగు విశ్వనాథ్ రెడ్డి, నగర కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షులు గొడుగు లక్ష్మి నారాయణ, పగిడిమారి మాజీ అధ్యక్షులు నరసింహారెడ్డి, పేరపల్ల కిష్టప్ప, వల్లంపల్లి శివ, హనుమంతుతో బాటు తదితరులు ఉన్నారు.

## ధరణి రైతుల పాలిట శాపం

(మొదటి పేజీ తరువాయి)

విధంగావిధి విధానాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.అధికారులు నిబద్ధతతో రైతు సమస్యలను పరిష్కరించేం దుకు కృషి చేయాలని ఆయన సూచించారు. భూభారతి చరితాత్మకం అని ఆయన అన్నారు.రానున్న కాలంలో రేవంత్ సర్కార్ రాష్ట్రాన్ని అభివృద్ధి పరిచేందుకు రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తూ రాష్ట్ర ప్రజలకు వెన్నంటి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యులు కెవిఎన్‌రెడ్డి, సుశీల్,రంగాపూర్ సింగిల్ విండో చైర్మన్ కుడుముల సురేందర్‌రెడ్డి, తహసీల్దార్ మురళీ మనోహర్, డిప్యూటీ తహసీల్దార్ వెంకట రమణ, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు, కల్వకుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పండిత్‌రావు, యూత్ కాంగ్రెస్ అచ్చంపేట నియోజకవర్గం అధ్యక్షులు క్యామ మల్లయ్య,నాయకులు కృష్ణారెడ్డి, వేమారెడ్డి, కృష్ణారెడ్డి, సీఈఓ విష్ణుమూర్తి, వివిధ శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణాలు సాంస్కృతి సాంప్రదాయాలకు నిలయాలు

(మొదటి పేజీ తరువాయి)

సకాలంలో అన్నదాతల ఖాతాల్లో వేసేందుకు కావలసిన పత్రాలసేకరణలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ధాన్య సేకరణ విషయంలో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్,ఉపాధ్యక్షులు రామకృష్ణా రెడ్డి, పెద్దమందడి సింగిల్ విండో అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ జడ్పిటిసిలు వెంకటస్వామి, రమేష్ గౌడ్, మాజీ సర్పంచులు, రమేష్ యాదవ్, శ్రీనివాసరెడ్డి,బాల్ చంద్రయ్య, సాకవెంకటయ్య, మాజీ ఎంపీటీసీలు రామచంద్రయ్యగౌడ్, సత్యరెడ్డి, దొడగుంటపల్లి మాజీ ఎంపీటీసీ సాయిభార్గవి రాజశేఖర్, అమ్మపల్లి వెంకటేశ్వర రెడ్డి, గట్టు యాదవ్, బాలు, వెంకటయ్య, వెంకటేశ్వర్ రెడ్డి సుదర్శన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

(మొదటి పేజీ తరువాయి)

నమోదవుతున్న కారణంగా ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా అవగాహన కలిగించాలని, వడ దెబ్బకు గురైన వ్యక్తులకు వెంటనే ప్రథమ చికిత్స అందించేటట్లు విస్తృత అవగాహన కల్పించాలని వైద్యులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా అంకిత భావంతో సేవలు అందించాలని వైద్య సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ దేవ సహాయం, జిల్లా వైద్య అధికారి స్వరాజ్యలక్ష్మి, సంబంధిత వైద్యాధికారులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు కాజీపూర్‌కు మంత్రి పొంగిలేటి రాక

**మద్దూర్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మద్దూరు మండల పరిధిలోని కాజీపూర్ గ్రామానికి భూభారతి ప్రారంభోత్సవం చేయడానికి రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి వస్తున్నట్లు మండల తహసిల్దార్ మహేష్ కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

## తెలంగాణ రాష్ట్రంలో అందాల పోటీల నిర్వహణ రద్దు చేయాలి

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న మహిళల అందాల పోటీలను రద్దు చేయాలని కోరుతూ పిఓడబ్ల్యు నాయకుల ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్‌తో బాటు ఆర్‌డిఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి జయలక్ష్మి, జిల్లా కార్యదర్శి సమీన్ మాట్లాడుతూ మహిళలను అవమానించి విధంగా రాష్ట్రంలో మిస్ వరల్డ్ అందాల పోటీలను నిర్వహిస్తున్నారని మిస్ వరల్డ్ అందాల పోటీలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలనిలేకపోతే పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని అన్నారు. మిస్ వరల్డ్ అందాల పోటీల వల్ల మహిళలపై ఇంకా అత్యాచారాలు అవమానాలు పెరుగుతాయి తప్ప ఎలాంటి ఉపయోగం ఉండదని అన్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అందాల పోటీల నిర్వహణను రద్దుచేసి మహిళలను గౌరవించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పిఓడబ్ల్యు, ఐద్వా పివైఎల్, పిడిఎస్‌యు సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. వినతి పత్రం అందించిన వారిలో పిఓడబ్ల్యు జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు సునీత, మంజుల, సత్యమ్మ, సిపిఐ, ఎంఎల్ మాస్‌లైన్ టౌన్ కార్యదర్శి కెంచె నారాయణ తదితరులు ఉన్నారు.